కథ

# కోడిబాయ బండిమామది

## బత్తుల ప్రసాద్

ఎండాకాలం కాకపోయినా ఎండమాత్రం శరశరకాచ్చాంది. బిర్సనపు యాప, శింతసెట్లు కొమ్మల నిండ ఆకుల్తో నిండు ముత్తయిదుల్లాగా కనిపిచ్చాండయి. ఆ శెట్ల మద్దన ఉన్న బోదకొట్టలం శిన్నోడు, కాదరయ్యలు ఇద్దరూ సిరిసాపమీంద కూకోని ఇస్పెట్టాకులు ఆడతాండిరి. వాళ్లట్టటయాన ఆడతాండరే గాని ఇద్దరి మనసుల్లో ఒక్కరవ్వ పదురుగానే ఉంది. ఏయటాన బండిమామ వచ్చుడోనని. ఆ వచ్చే ఏం. ఆ మనిసేమన్నా పొడుచ్చుడా? కరుచ్చాడా? అనడానికి కుదర్దు. అంతకంటే మాంతమైంది జేచ్చుడు. అందరికి 'ఈళ్లిద్దరూ ఏందో జేచ్చాండరు' అని జెప్పి మానందీచ్చుడు. అట్టని ఆ మనిసి శానా నికార్సయినోడేం కా. ఆకులాడ్తడు. సారాయి తాగుతడు కోడి పందాలకు పోతడు. ఎవరన్నా ఆడోళ్లు కనిపిచ్చే ఎంపర్లాడ్తాంటడు. టయాన్ని బట్టి బీడీలు, సిగిరెట్లు కాలుచ్చాంటడు. అయినా ఆమనిసంటే ఈళ్లిద్దరికి బెరుకే. ఎందుకంటే ఎగతాళిమనిషి గాబట్టి.



బండిమామ శిన్నోనికి వర్సకు మామయితడు. ఈనికే కాదు ఊళ్లో శానామందికి మామయితడు. అది ఆ మనిసి కథ.

ఇంక ఈళ్లిద్దరి గురించి సెప్పాలంటే శిన్నోడు, కాదరయ్య ఇద్దరూ సదూకుంటాన్న పోరంబోకునాయాళ్లు. సదువుకుంటాండరేగాని, ఆ అవ్వాలు ఒక్కటి గూడా లేవు. ఇద్దరి కులాలు వేరయినా ఇద్దరు మాంచి సావాసగాళ్లు. పొద్దన్లేసిన కాన్నిండి సాయంత్రం దాంక శెట్లంబడి, శామలంబడి తిరగడం, ఇస్పేట్టాకులు, శెక్కాబొమ్మ ఆడ్డం. ఒగిసి ఆడపిల్లోల్లకు లైన్లేయడం, రోజా ఇదేవని ఇద్దరూ ఒకే కారు పిల్లోళ్లు ఇరవై ఇరవై రొండేండ్లుంటయి. ఇద్దరిది ఒకేబడి ఒకే బెంచి. కాలేజీలో కూడా అంతే. సదువులో కూడా కూడ బలుక్కున్నట్లు ఒకే సమత్సరం పెయిలయిరి. ఫెయిలయినంక పోరంబోకు పనులు ఇంగొక్క రవ్వ ఎక్కువాయె.



సగిలేటిపక్కన ఇంగిలీసోళ్లు కట్టిచ్చిపోయిన పెద్దచర్చి, బంగళా, నిండా శెట్లు ఆడాడ బోదకొట్టాలు, పాడుబన్నె మిద్దెలు, పెంకులిల్లు ఉంటయి. తెల్లోల్లు పోయినంక నల్లోల్లు ఆ బంగళాను బాగుచేయలేక అదట్ట వయసయిపోయిన సావుకారి పెండ్లాం మాదిరుండె. బండిమామ, శిన్నాని ఇండ్లు ఆడనే ఉంటయి. బండి అంటే... ఆయన వాళ్ల వంశంలో రెండు తరాల కింద దొరలకు బండికడ్తాన్న దాన వాళ్లింటిపేరు అదయింది. ఏదయితేనేం ఆ మనిసిని అందరూ బండిమామ అని పిలుచ్చరు. అసలు పేరు శానామందికి తెలియదు. ఈ మనిసి సేసే ఉద్దోగం ఏంది అంటే బి.డి.ఓ. అని జెప్తరు. ఓయమ్మో శానా పెద్ద ఉద్దదోగమే అనంటే అదేంగాదు బేకారు డెవలప్‌మెంట్ ఆపీసరు' అని శెప్తాంటరు కుశాలకు. ఇంగవాళ్ల భార్య ఇషయానికివచ్చే ఆమె టీచ్చరు. మరి ఈ మనిసిని ఎట్ల జేసుకున్నె దబ్బా అనంటే? అదో కథ

బండిమామ ఒగిసిలో సినిమా యాక్టరు మాదిరి రింగురింగుల ఎంటికలు మూతిమింద సన్నటి మీసం మనిసి నిగినిగలాడ్తా కనిపిచ్చిన ఆడపిల్లను ఒక్కర్ని కూడా ఇడ్సకుండా లైనేచ్చాండె. టీచ్చరు ట్రైనింగ్ శేచ్చాన్న ఈయమ్మ ఆమె యంట బడ్తాంటే, సరేలే ఈమైన తిరుగుతాండడు అని ఆ మనిసి తిట్టు జూసి నవ్వుతానే మనోడు మాట కలిపె. ఆమె 'నువ్వేం శేచ్చాండవ్' అనడిగితే 'ఇంజనీరు'అనె. కసాయోన్ని గొఱ్ఱెనమ్మినట్టు నమ్మె అయవ్వను పెండ్లి జేసుకుండె. పెండ్లి జేసుకున్నెంక తెలిశ ఆ మనిసి చెప్పింది ఇంజనీరు అనంటే రైలు ఇంజన్లో నీరు పోసే ఉద్యోగమని. పెండ్లయినంక ఏం జేచ్చది. మెదలకుండుండె. అప్పటాలనుండి ఆమె టీచ్చరు పనిశేచ్చావుండె. ఈన బేకారుగా తిరుగుతా తెల్లార్తానే లేచి ఏటికి రొంటాలకు పోయిరాడం, కోళ్లకు గింజెలెయ్యడం, మొకం కడుక్కుంటానే ఉడుకుడుకు బువ్వ పచ్చికారెంలో ఇంత నెయ్యేసుకొని ఆదల బాదల మింగి, బీడి ముట్టిచ్చుకొని, ఇంటెనక దిబ్బలోకి పోయి ఎఱ్ఱలు తొవ్వుకోడం, ఆ దిక్కు ఎవురన్న పిల్లనాయాళ్లు కనిపిచ్చే వాళ్లను గమ్మిచ్చి వాళ్లతో తొవ్వియడం, లేకుంటే వాళ్లను ఏటికి తీసకపోయి ఏట్లో గుంతలు సల్లియ్యడం, పన్నెశాపలు ఇంటికి తెచ్చుకొని తిండం, మల్లా ఏటికి పోయి సాయంత్రం దాంకా గాలాలు ఎయ్యడం శాపలు పడ్తే తెచ్చి ఇంట్లో ఇచ్చి శీకటి పడ్తానే ఊళ్లోకి పోయి ఇంత సారాయి తాగి రాడం, పది,

పదకొండు గంటల దాంక దారంబడి ఎవురు దొరికితే వాళ్లతో తువుక్, తువుక్ మని ఊసుకుంటూ యవ్వారం బెట్టుకోని, ఇంటికొచ్చి ఆ శావలు ఇంత బువ్వ యారకదిని పండుకుంటడు ఇదీ ఆ మనిసి జేసేపని.



వాళ్లింట్లో ఈన వచ్చెం. ఇరవైకోళ్లదాంకుంటయి. వాటిని కొయ్యడు, అమ్మడు. కోళ్లు పెరుగుతాండటయి. తెగులు తగిలి సచ్చాంటయి. కాని వాటిని అమ్మాలంటే ఆ మనిసికి శేతులాడవు. ఇంగ నగిలేట్లో నీళ్లు ఎప్పుడూ పారతాంటయి. దాంట్లో ఉన్న శేపలు, యండ్రకాయలు, తాబేళ్లు, బుడ్డకోళ్లు, వాగంబడి దొరికే ఉడుములు దేన్ని ఇడ్సడు. వారానికొకసారి కోడిపందాలకు పోయి దేన్నో దాన్ని గెల్చుకొని వచ్చాంటడు ఇది ఆమనిసి కథ.

సరే బండి మామకు ఆ పిల్లనాయాండ్లకు ఎందుకు పడదు? అనంటే ఈ మనిసి పొద్దన సాయంత్రం రొంటాలకు ఏటికి పోయి కంపశెట్లల్లో గూకోని పొద్దన్నే ఏరు దాటుకుంటూ గడ్డికి పొయ్యేటోళ్లను సాయంత్రం గడ్డి గంపలెత్తుకొని వచ్చేవాళ్లు తొడల్లోతు నీళ్లల్లో కుచ్చెల పైకెత్తుకొని వచ్చాంటే, తొంగి తొంగి సూచ్చాంటడు. ఆ మనిసి అట్ట జూసేది కనిపెట్టి అందరికి శెప్పిండ్రని శీన్నోడు, కాదరయ్య అంటే ఆ మనిసికి కోపం, ఈళ్లేదైనా సొట్టపని జేచ్చే అది వాళ్లిండ్లల్లో జెప్పి వాళ్లను తిట్టి పిచ్చాంటడు. వాళ్లు కూడా బండిమామను ఎట్ట బాధపెట్టాల్నా అని కాసుకోనుండిరి.

ఆయాల వాళ్లట్ట బయంబయంగా ఇస్పేట్టాకులు ఆడతావుంటే, బయట కొట్టం కింద రెండు కోడిపుంజులు కొట్లాడ్తా ఒకటి ఓడిపోయి బెదిరి కొట్టంకున్న కిటికీలో నుండి లోపలికి దూకె. అదెట్ట దూకార్క ఇద్దరూ బెదురుకుండిరి. ఎంబడే తేరుకొని శీన్నోడు 'ఇనెక్క బండిమామకోడి ఇన్నాళ్లకు దొరికింది పట్టుకోరా' అనె. వాగట్ట అంటానే కాదరయ్య ఎగిరి కోడి మిందికి దూకి పట్టుకుండె. వాడట్ట పట్టుకుంటానే కోడి ఒత్తుబోయి పెకాటిచ్చె శీన్నోడు వచ్చి దాని గొంతు పట్టుకుండె. కాదరయ్య గొంతిడ్సు,గొంతిడ్సు అని అంటా ఉంటె శీన్నోడు దాని గొంతు ఇర్సె. 'వరేయ్ నేను గొంతు ఇడ్సమంటె ఇర్సినవేంది' అని అట్టిట్ట జూసి సూర్లో ఓ పాత కొడేలి కనిపిచ్చానే దాన్ని తీసుకొని సచ్చిందాన్ని అలాల్ జేశ కాదరయ్య. ఆ పిల్లోడు ముద్దార్ తినడు అట్టని కోడిశియ్యలు ఇడ్సిపెట్టలేడు. మంచోని బుద్ధి మాంసం కాడ తెలుచ్చుదన్నట్లు. శియ్యలు కాడమనోడి బుద్ధి బయట పడ్తాంటది. ఒకసారి శీన్నోడు, కాదరయ్య సురేసు ఎంటంబడి శికారికిబోయిరి. శీన్నోడు సురేసుకు తుపాకి తూటాలు పటుక్కునే దానికి పోతే. కాదరయ్య అలాల్ శెయ్యడానికి పాయె. మిట్టంబడి పోతావుంటే సురేసుకు నిలబడి నెమరేచ్చాన్నె కొండ గొర్రెకని పిచ్చె. దాన్ని తుపాకితో కాల్చి, లైటేసి సూచ్చే అదట్టనే నిలబడుకొని కనిపిచ్చె. సురేసు మళ్లీ కొడ్తానే శీన్నోడు కాదరయ్య ఉరుకుతాపోయి పట్టుకుండిరి. కాదరయ్య అలాలు జేచ్చావుంటే శీన్నోడి కాలికి ఇంగొక గొర్రెకాళ్లు తగిలె. ఒక్కటి గాదు రెండు ఒకటి పండుకొని ఇంగొకటి నిలబడుకొనున్నయి అని జెప్పె సురేసు. ఇంగోదాని కాడికి ఆదల బాదల వచ్చిన కాదరయ్య దానితోక కింద కాలి బొటికినవేలు బెట్టి, తోక ఊపుతా 'బతికింది బతికింది' అని సచ్చిందాన్ని అలాలు జేశ, అట్టాటోడు కాదరయ్య ఈ కోడి కూరాకు ఇడుచ్చుడా?

ఇద్దరు గలిసి కోడిబొచ్చు ఒలిసిరి. ఈలోగా శీకటి పడాంటే మెల్లంగ ఏట్లోకి పోయి కోడిబొచ్చు ఇసికలో బూడ్సిరి. కాదరయ్య రాళ్లతో పొయ్యిబెట్టి మంట ఎలిగిచ్చావుంటే శీన్నోడు వాళ్లింటికి పోయి ఇంట్లో ఎవరూ సూడకుండా ఇంత నూనె, దనియాలపొడి, కారంబొడి, పసుప్పొడి కావల్సి నోటియన్ని తీసకచ్చి. కుండపెంకులో కోడ్ని మాడ్సుకొని ఇద్దరూ సంపుకుండిరి. ఇద్దరూ కోడితిన్నె దానికంటే బండిమామ కోడి తిన్నెమని సంబరపడిరి.

మల్లారోజ పొద్దన్నే కోడిపోయిన బండిమామ మొగమెట్టుంటదో సూడాలని బండిమామ ఇంటికాడికి పోయిరి. బండిమామ కోళ్లకు గింజలు సల్లుతా వుండె. వీళ్లను జూసి 'ఏమోయ్ ఇట్టొచ్చిరి' అనె. 'ఆ ఏమీ లేదు మామ ఏట్లో నీళ్లు శానా తగ్గినయి శావలు బోకెలక లేచ్చాండయి. ఏదన్నా శిన్న గుంతజూసి సల్లుదామనుకుంటాడం' అని. "సల్లుదాంపావోయ్' అనె.

ఆ మనిసికి కోడి పోయింది తెల్సిందో లేదోనని, మెల్లంగ కోళ్ల గురించి మాటలు మలిపిరి. అవ్ మామా ఈ పెట్టఎన్ని కార్లు జేసింది. ఆ వుంజు ఏ పెట్టకు పుట్టింది. అని అడుగుతాంటే అన్నీ శెప్తాండె ఏందబ్బా ఈ మనిసి కోడిబోయినా కనుక్కోలేదు...

ఆ మద్దెన వాళ్లమ్మ సచ్చిపోతే శిన్నదినం నాడు పిల్లోల్లు 'నాయనా ఓ కోన్ని కొజ్జమా' అనంటే, 'కోసుకునే కోల్లు యాండయిరా' అర్దో ఆ పెట్ట ఇపుడే తొక్కిళ్ల కొచ్చింది. ఇదేమో గుడ్లు పెడతాంది. అది పిల్లల కోడి, ఇది పందెం వుంజు, అది బెద్ర. అని జెప్పి ఒక్క కోడిని కూడా కొయ్యనియ్యక పాయె. ఏకోడికి ఎన్ని ఈకలుండయోకూడా తెల్సిన మనిసి కోడిపోయింది అనంటే గమ్మునుంటడా? అనుకుంటూండిరి. ఇంతలో శీన్నోడి వాళ్లమ్మ 'ఒరేయ్ శీన్నాడా' అని పిలిశ. 'ఉండురా ఇప్పుడే వచ్చ' అని కాదరయ్యతో శెప్పి శీన్నోడు వాళ్లింటికి పాయె.

కాదరయ్య బండిమామ కాడ్నే కూకోని ఏ వుంజు పందానికి పనికొచ్చది. బండిమామకోళ్లు పందెంలో ఎన్నిసార్లు గెలిసినయి. ఏ పెట్ట ఎన్ని గుడ్లు పెడ్డది. ఏది ఎన్ని పిల్లల్ని లేపింది. అంటాన్న విషయాలను చెప్తాంటే ఇంటా కూకోనుండె. కాసేపయినంక శీన్నోడు కాదరయ్య దగ్గరకు వచ్చావుంటే కాదరయ్య బండిమామతో 'మళ్లా వచ్చ మామ' అని చెప్పి శీన్నోనికి ఎదురుబాయ. శీన్నోడి మొకం అదోరకంగా ఉండె. కాదరయ్య దగ్గరికి వచ్చానే శీన్నాడు 'వరేయ్ నిన్న మానాయన తెచ్చిన బెద్రపుంజు కనబడలేదంట. అందుకే మాయమ్మ నన్ను పిల్సింది' అనె. అప్పుడు తెలిసొచ్చె. శీన్నోడికి కాదరయ్యకు వాళ్లు తిన్నెది బండిమామ కోడిగాదు. శీన్నోడి కోడి అని...

■